
# అన్నీ ఒకచోటే

- జయంతి పాపారావు



'సీపుర్లు... సీపుర్లు... సీపిర్లండి... సీపిర్లండి'

'ఒద్దమ్మా, ఒద్దు'.

'సవగ్గా ఇత్తా కొనమ్మా'.

'చెయి ఖాళీ లేదు'.

'ఓ గంట పోనాక రానేటీ?'

'ఒద్దమ్మా, ఒద్దొద్దు.'

'ఏటొచ్చిందేటి? ఒవుల్లూ కొంటం నేదు. మావ్ సవగ్గా ఇస్తన్నా ఒద్దంతన్నారు. పుంజీడు రాచ్చసబజాల్లొచ్చేసి ఊరు ఊరంతా ఆక్కరమిచ్చేసు గున్నారంత! ఎక్కడ ఇన్నా ఒకటే గోల. మావెల బతకాల? సెప్పుతల్లీ సెప్పు! కాళ్లరిగిపోయేలా కాలనీ అంతా తిరిగినాను. ఒవుల్లూ కొన్నేదు. ఇదివరక అరగంటలో ఆరు సీపిర్లు కొనేవోళ్లు. మీరూ వలగంటే ఎలగమ్మా! ఇంత తిరిగినా ఇంతవరకూ బోణీకూడా నేదు. బేరం తవల్లేదు. తల్లీ, నువ్వన్నా కొనమ్మా! సవగ్గా ఇత్తాను. ఆరేళ్ల కాణ్నుచ్చీ నాకాడే కొంతన్నారు. నువ్వన్నా కొనమ్మా, నీకు పున్నెముంతాది. ఈమద్దికాలంల నాకాడ కొన్నేదు, తల్లీ! ఇయ్యాలైనా కొనమ్మా!'

'లేదమ్మా, లేదు, ఒద్దమ్మా ఒద్దు. ఇంట్లో చీపుర్లు చాలా ఉన్నాయ్. ఏం చేసుకోవాలి? అవసరం లేదమ్మా. మాట్టాడ్డానికి కూడా ఖాళీలేదు.'

'మావెలగ బతకాల?'

'అది నాకు తెలీదమ్మా! ఎవరి సుఖం వాళ్లు చూసుకుంటారు. ఎవరి బాగు వాళ్లు చూసుకుంటారు. అంతేనమ్మా అంతే! 'ఆరేళ్లకాణ్నుచ్చీ కొంతన్నారునాకాడ, అతిమానం ఉండొద్దా?'

'బజార్లో అన్నీ దొరుకుతున్నాయ్. అన్నీ ఒకచోటే దొరుకుతున్నాయ్. ఎక్కడ వెదికినా ఏ గుండెల్లో వెదికినా దొరకనివి అవేనమ్మా; ప్రేమాభిమానాలే!'

'ఎల్లి పొమ్మంతారా?'

'మంచిదమ్మా, వెళ్లు'.

⁂ ⁂ ⁂

'కొబ్బరికాయలు కొబ్బరికాయలు... అమ్మగోరూ, కొబ్బరికాయలు'

'ఒద్దు తల్లీ, ఒద్దు. ఇంట్లో చాలా వున్నాయ్. అవసరం లేదు.'

'ఓరానికి పది కాయలకు తక్కువగాకుండా కొంతన్నారు. నాకాడే మూడేళ్లకాణ్నుచ్చీ కొంతన్నారు. ఇయ్యాల కాదంటే ఎలగవుద్ది! కొనమ్మా, కొను. ముదరకాయలు, కొట్టి సూడండి; సెంద్రుణ్ని సూచినట్టుంతాది; దేవుడికి కొడితే, దేవుడే సేతులు సాచి బేగివ్వమంతాడు; వలాంటి ముదారకాయలు ఒద్దంతారేటి? పది కాయలివ్వనా? ఏటి, ఎన్నివ్వమంతారు?'

'ఒద్దమ్మా, ఒద్దు. కాయలున్నాయని చెప్పాను కదా! ఇలా మాట్లాడుతూ కూర్చుంటే నాకు ఇంట్లో పనులు అవ్వ కదమ్మా!'

'నీ సేత్తో బోణీకొడితే, తట్టెడు కాయలూ బేగి సిటాంలో సెల్లిపోతాయి; వందుకే గదమ్మా నిన్నొగ్గడం నేదు; బేగి రండి, పది కాయలు తీసుకొని బేగెల్లిపొండి; నాను నోరిప్పకుండా ఎల్లిపోతా; రా, తల్లీ బేగిరా!'

'ఒద్దనిచెప్పాను గదమ్మా! ఒద్దమ్మా, ఒద్దు!'

'నాకు తెల్దేటి, నువ్ రాచ్చసబజార్లో కొంతన్నావ్; వందుకే నన్ను తవిరేస్తన్నావ్.'

'నువ్ చెప్పింది నిజమే. ఏం చేయమంటావ్?'

'అక్కడికెల్లకుండ నాకాడే కొనాల; వంతేగదా!'

'అది కుదరదు; నేనే కాదు అందరూ కూడా అక్కడే కొంటున్నారు; రోజుకి కనీసం పదివేల మందికి తక్కువగాకుండా రాక్షస షాపుల్లోనే కొంటున్నారు; అన్నీ ఒకచోటే దొరుకుతాయి కదా! ఆ సదుపాయాన్ని ఎవరు కాదంటారు! ఎవరి సదుపాయం వాళ్లు చూసుకుంటారు; ఎవరి సుఖం వాళ్లు చూసుకుంటారు; ఎవరి లాభం వాళ్లు చూసుకుంటారు; ఒద్దంటే మానేస్తారా?'

'మావెల బతకాల?'

'నిజవే, నువ్ చెప్పింది నిజవే; వీధికో సారాషాపు పెట్టేసి తాగొద్దంటే మానేస్తారా? వీధికో దొంగ సారా షాపు నడుస్తుంటే, దొంగసారా తాగొద్దంటే మానేస్తారా? సారా వ్యాపారం సాగిస్తూ సారా తాగొద్దని బోర్డు కడితే మానేస్తారా? నగ్న నృత్యాలు రాత్రిపగలూ కూడా నడుస్తుంటే, చూడొద్దంటే మానేస్తారా? చుట్టా, బీడీ, సిగరెట్టు, ఖనీ, నల్లమందు, వయాగ్రా వంటివి మంచివి కావని ప్రచారం చేస్తే, మానేస్తారా? ప్రతి కాలనీలో రెండుమూడు వ్యభిచార గృహాలు నడుస్తుంటే, వయాగ్రా వాడుతూ వయసు మళ్లినవాళ్లు కూడా వెళ్లిపోతారేగానీ మానేస్తారా? అవి లేకుండా, రాకుండా చూడాలి. అప్పుడే మానేస్తారు; దొరుకుతున్నంతకాలం ఎవరూ మాన్రు; రాక్షస బజార్లు కూడా అంతే; నీ పొట్టకోసం అక్కడికి వెళ్లొద్దంటే, ఎవ్వరైనా మానేస్తారా? నీ బతుకుతెరువు గురించి ఎవరూ ఆలోచించరు గదమ్మా! నీ పొట్ట ఎవరు కొడుతున్నారో వాళ్లనే అడగాలి; నన్నడిగితే, నేనేం చేయగల్ను?'

'ఎల్లి పొమ్మంతారా?'

'మంచిదమ్మా, వెళ్లు.'

⁂ ⁂ ⁂

'అరటికాయలు... ఆనబకాయలు... ఉల్లిపాయలు... వంకాయలు... అల్లం... పచ్చిమిరప కాయలు... ఆకూకూరలు... దొండ కాయలు... బెండ కాయలు... అమ్మగోరూ, బేగిరండి; ఏటివ్వమంతారు?'

'ఏదీ ఒద్దు నాయనా, అన్నీ ఇంట్లో వున్నాయ్'.

'అలగంతే నానొల్లకుంతనేటి? పదేళ్లకాణ్నుచ్చీ నాకాడే కొంతన్నారు; ఇయ్యాల కాదంటే నానొల్లకుంతనేటి? నాను కూరగాయలిత్తన్నాను; నువ్ నాకు డబ్బు లిత్తన్నావ్; అదంతే నేటమ్మా?! రోజూ మీ గుమ్మంకాడికొత్తన్నాను; మంచీ చెడ్డా, కష్టంసుఖం సెప్పుకుంతన్నామ్; దాని చంగతేటిమరి?! రాచ్చస బజార్లో కొంతే, అయ్యన్నీ దొరుకుతాయేటి? ఏటమ్మా, నవ్వలగంతన్నావ్?!'

'నువ్ చెప్పింది నిజమే; నేను కాదన్లేను; నేనూ ఆమాటే అందరికీ చెబుతున్నాను; నువ్వూ నీలాగే ఎందరెందరో గంపెడాశతో గంపలతో మాక్కావాల్సినవన్నీ మా గుమ్మంలోకి తెస్తున్నారు; ఊసూ పలుకూ ఆడుకుంటున్నాం; మంచీచెడ్డా, కష్టం సుఖం చెప్పుకుంటున్నాం; కలిసిమెలిసి ఒక కుటుంబంలా బతుకుతున్నాం; వీటినన్నింటినీ రాచ్చసబజార్లు నమిలి మింగేస్తున్నాయ్; ఇంట్లో కూరలు చాలా వున్నాయ్; నీ దగ్గర ఇప్పుడు కొంటే కుళ్లబెట్టుకోడమే అవుతుంది; నేను

కొన్నంత మాత్రాన నీ బతుకు వెళ్లదు కదా! అది మీ సమస్యకి పరిష్కారం కూడా కాదు; నువ్ మరోలా అనుకోకు, నాకు చాలాపనుంది.'

'మావెలగ బతకాల?'

'నువ్ వోట్లు వేస్తున్నావ్ కదా!'

'నావొక్కి వోటేకాదు, మా ఊరోళ్ల వోట్లన్నీ నానే ఏయిస్తన్నా?'

'వోట్ల వ్యాపారం కూడా చేస్తున్నావా?'

'ఎలక్సన్ల సీజన్లో సేత్తావుంటా!'

'అదెలాగ?'

'బ్రోకరుగాడితో నాకు ఇలాకీ వుందమ్మా? ఆడొచ్చి వోట్లు నెక్కేసుగుంటాడు. ఎన్ని వోట్లుంటే అన్ని రోజువారీ కూలీ సొమ్ము నాకిచ్చేత్తాడు. నాకు అదనంగా పదేను రోజుల కూలి నాకిత్తాడు. వంతేనమ్మా!'

'మావెల బతకాలని నన్నడుగుతున్నావ్ కదా, ఆ బ్రోకరు గాణ్నే అడుగు; నన్నడిగితే ఏం లాభం?'

'ఎలక్సన్లు అయిపోనాక ఆడు మరింక కనిపిచ్చడండి; ఆడు దొంగనాకొడకండి; నేబరు కంట్రాక్టరండి; ఎలక్సన్లు ఒత్తే సాలు. బుజాలెగరేసుగుంతా, వోట్ల కంట్రాక్టరైపోతాడండి; గుండుసూది కన్నబాబు మన ఎమ్మెల్లే అనుకోండి; ఏటంటే, ఏటి సేత్తాడంటే, ఆడికా ఇచ్చిచ్చి ఈడు నచ్చలమీద నొల్లుకుంతాడండి; మా వూరోళ్ల సేతుల్లో రోజుకూలీ ఎడతాడండి; నాకు పదేనురోజుల కూలీ ఇత్తాడండి; ఎలక్సను దినాన్న అయిదు రిచ్చాలూ, ఓ జీపీ నాకాడెడతాడండి; వంతేనండి; ఆడు దొంగనాకొడకండి, మల్లీ కనిపిచ్చుడండి!'

'గుండుసూది కన్నబాబన్నావు కదా, ఆయన్నే వెళ్లి అడుగు!'

'ఏటి, ఆడికాడికెల్లడవే; ఆడు మరీ దొంగనాకొడకండి; ఆడికాడ కెల్లడవంటే ఏటండి? ఏటనుకుంతన్నారు? పోలీసోడుకాడికెల్లి ఆడి సేతుల్లో బుర్ర ఎట్టడవేనండి; ఆడికాడ పోలీసోల్లుంతారండి; నాను పెదాన మంతిరికి కూడా భయపడనండి, పోలీసోడంటే మాత్తరం భయవండి! ఆ కతంతా ఇప్పుడెందుకు లెండి; ఏటంటే, కన్నబాబుగోడికాడికెల్లడవంటే, మూడు దినాల పని మానుకొని ఆడింటి సుట్టూ తిరగాలండి; ఎప్పుడో దర్సినవిత్తాడండి; మూడేమూడు సిటాంల మాట్టాడతాడండి; మూడే మూడచ్చరాలు పలుకుతాడండి; 'సూత్తాను' అంతాడండి; వంతేనండి; మల్లీ కనిపించడండి; దొరకడండి; ఆడికాడికెల్లి ఏటి నాపవండి; మూడురోజుల పని దండగ; వంతేనండి; తెల్లారి నెగిసిన కాణ్నుచ్చీ ఆడి సుట్టూ పదిపదేను మందిరి గూకుంతారండి; వొవిడి కొంప ముచ్చాల, ఎలా ముచ్చాల అని అల్లంతా ఆలోసిత్తావుంతారండి; ఎక్కడి ఖాలీ బూవులున్నాయా, ఆటిని ఎలగ ఆక్కరమిచ్చాల ఇయ్యే కబుర్లండి; వొవుడి బూవి ఎలగ ఆక్కరమిచ్చాల, ఇయ్యే ఆలోసన్లండి; పద్దు, మాలినోణ్ని మాతో మాట్లాడితే ఆడికేటి కలిసొత్తాదండి!'

'అర కెజి వంకాయలియ్యి, చాలాసేపు మాట్లాడేవు'.

'అంతేనంతారా?'

'అయితే కెజీ ఇయ్యి!'

* * *

'కొబ్బరి నూనె... కొబ్బరి నూనె... ఇప్పుడే ఆడిన కొబ్బరి నూనె... తాజా తాజా కొబ్బరి నూనె... అమ్మా... ఎంతివ్వమంటారు?' 'నీ కిరాణా కొట్టు ఏమైంది?'

'మూసేసానండి; బేరాల్లేవండి; ఎవళ్లూ మా దగ్గర కొనడం లేదండి; సైకిలు మీద ఇంటింటా తిరుగుతూ కొబ్బరి నూనె అమ్ముతున్నానండి; బతకాలకదండీ; ఏదో వొకటి చేయాలకదండీ; మా కుటుంబం అయిదు తరాల నుండి కిరాణా చిల్లర వ్యాపారమేనండి; ఇప్పుడది పోయిందండి; బతుకు వీధిన పడ్డాదండి; ఏపారవంతా రాచ్చసబజార్లదేనండి; నాలుగైదు ఒచ్చేసాయండి; అక్కడ ఇసకేస్తే కిందికి రాలని జనవండి; మా షాపులకు ఎవరూ రావడం లేదండి; మూసేసుకున్నావండి; మనకి ఉప్పూ, పప్పూ కూడా

'మన నగరంలో రోజుకి కనీసం పది వేల మంది నాలుగైదు రాక్షస బజార్లలో కొనుగోళ్లు చేస్తున్నారంట. మన నగరంలోని కొనుగోలుదార్ల సొమ్మంతా ఇదివరకు వేల మంది చేతుల్లోకి వెళుతూ వుండేది. వేల మందికి జీవనోపాధిగా వుంటూ వుండేది. ఇప్పుడది నాలుగైదు రాక్షస షాపుల్లోకి మాత్రమే వెళ్లిపోతోంది. అంతే కదండీ!'

ఏపారం సేయడం రాదన్నట్లు అమెరికా కంపెనీవోడు వాల్‌మార్ట్ మన దేశంలో చిల్లర ఏపారం చేస్తానంటున్నాడండి; మన ప్రభుత్వం ఆళ్ల కాళ్లట్టుకొని బొట్టెట్టి పిలస్తా వుందండి; ఇదేం టండి?! మాచేత కాని ప్రజలకి చిల్లర వ్యాపారం కూడా రాదని ప్రపంచానికి చెప్పుకోడవేనండి; అంతేకాదండీ; ఆడొస్తే మిగిలిన దుకాణాలు కూడా మూతపడిపోతాయండి; గవర్నెంటుకి వాల్‌మార్ట్ వాడే కావాలి గానీ, మావక్కర్లేదండి; ప్రజలక్కర్లేదండి; ఎక్కడ చూసినా జనం ఏడుపేనండి; ఏటి చెయ్యాలో ఎవళ్లకీ పాలుపోడం నేదండి!'

'కొబ్బరి నూనె ఇంట్లో వుంది బాబూ, ఒద్దు; జుత్తుకీ ఒంటికీ రాసుకోడం ఎప్పుడో మానేశారు; కొద్దిమంది పాత తరంవాళ్లే ఇంకా వాడుతున్నారు; కొందరు దేవుడికి దీపం పెట్టడానికి వాడుతున్నారు; వాడకం తగ్గిపోయింది'

'ఒస్తానమ్మా!'

'ఒక అరలీటరిచ్చి వెళ్లు; దేవుడి దీపానికి వాడుతాన్లే; మీకు వ్యాపార సంఘాలున్నాయ్; పెద్ద పెద్ద సంస్థలున్నాయ్; ప్రజాప్రతినిధులున్నారు; వాళ్లేం చేస్తున్నారు? వాళ్లెందుకున్నట్టు.'

'నాకంతలా తెలీదు కానీ అందరూ ఓ మాట చెప్పుగుంటున్నారండి: అందులో కొందర్ని గవర్నమెంటు కొనేసిందంటండి; మిగిలిన వాళ్లను రాక్షస బజార్లు కొనేసాయంటండి!'

'వెళ్లొస్తానమ్మా!'

'మంచిది.'

* * *

'చీరలండి చీరలు... వెంకటగిరి, ఉప్పాడ, గద్వాల, పోచంపల్లి, కంచి చీరలండీ చీరలు... కొత్త కొత్త డిజైన్ల కాటన్ చీరలు... అమ్మగారూ, చూస్తారా?'

'ఏంటి, నువ్వా?! ఇలా ఇంటింటా తిరుగుతూ చీరలమ్మడమేంటి?' ఎంతో పేరున్న బట్టల షాపు మీది! ఏమైంది?!'

'బేరాలు లేవండి; మూసేసానండి; తరతరాల నుంచి మాకు బట్టల వ్యాపారమేనండి; ఇది తప్ప మరో పనేదీ మాకు రాదండి; ఏం చేస్తామండి; కూలి పనికి వెళ్లలేమండి; నామోషీ అండి: కూలైనా గిట్టితే చాలని బట్టలే అమ్ముతున్నానండి; కూలి కూడా గిట్టడం లేదండి; ఏం చేయాలో తెలీక ఈ పనే చేస్తున్నానండి; ఇంత నాణ్యమైన చీరలు ఇంత చవగ్గా ఏ షాపులోనూ దొరకవండి; చీరలు చూస్తారా?'

'ఒద్దు బాబూ, ఒద్దు; నిన్ననే మా కోడళ్ళు చీరలు కొనేసారు; బంగారు గొలుసు ఓ రాక్షసబజార్లో లాటరీలో దొరుకుతుందని అక్కడే కొనేసారు.'

'ఏంటోనమ్మా, అంతా చిత్రంగా వుంది; నా కళ్లను నేనే నమ్మలేకపోతున్నాను; ఏం జరుగుతోందో, ఎందుకు జరుగుతోందో ఏమీ తెలీడం లేదమ్మా; పాలకులు ఏమో అభివృద్ధి అభివృద్ధి అంటున్నారు, చిన్న జనం మాత్రం ఎక్కడ చూసినా కూలీలుగా మారిపోతున్నారు; చిన్న రైతులు కూలీలుగా మారిపోతున్నారు; వృత్తి పనుల వాళ్లు కూలీలుగా మారిపోతున్నారు; చిల్లర వ్యాపారస్తులు కూలీలుగా మారిపోతున్నారు; వలసలు పోతున్నారు; చిన్న పరిశ్రమలు మూతలు పడిపోతున్నాయి; ఏం జరుగుతోందో ఏమీ తెలీడం లేదమ్మా; రాక్షసులే కానీ చిన్న జనం మరింత బతక లేరేమో!'

'చదువుకున్న మా కోడళ్లు కూడా బంగారు గొలుసు లాటరీలో దొరుకుతుందని నిన్ననే కొనేసారు!'

'దొరికిందా, అమ్మా!'

'లేదు.'

'వెళ్లొస్తానమ్మా!'

'మంచిది బాబూ!'

* * *

'మా మాటలన్నీ వింటున్నారా? నిద్రపోతున్నారా? ఉద్యోగం చేసినంత కాలం ఉద్యోగాన్ని ప్రేమించారు; పదవీ విరమణ చేశాక నిద్రను ప్రేమిస్తున్నారు. మీరు నన్నెప్పుడూ ప్రేమించలేదు! అంతేకదండీ!'

'అవును.'

'మన నగరంలో రోజుకి కనీసం పదివేల మంది నాలుగైదు రాక్షస బజార్లలో కొనుగోళ్లు చేస్తున్నారట. మన నగరంలోని కొనుగోలుదార్ల సొమ్మంతా ఇదివరకు వేల మంది చేతుల్లోకి వెళుతూ వుండేది; వేల మందికి జీవనోపాధిగా వుంటూ వుండేది; ఇప్పుడది నాలుగైదు రాక్షస షాపుల్లోకి మాత్రమే వెళ్లిపోతోంది; అంతే కదండీ!'

'అవును.'

'అమెరికా వాల్‌మార్ట్ వస్తే, నాలుగైదు రాక్షస షాపుల్లోకి వెళ్తున్న సొమ్ములో ఎక్కువ భాగం వాల్‌మార్ట్ లోకే వెళ్లిపోతుంది. అంతేకదండీ!'

'అవును.'

'నలుగురైదుగురు బకాసురుల బాగుకోసం ఎందరో బలైపోతున్నారు. మల్లెతీగల్లా అల్లుకొని పుష్పించి పరిమళిస్తున్న మానవ సంబంధాలు విచ్చిన్నమైపోతున్నాయ్. అంతేకదండీ!'

'అవును'. ★